ఆంధ్రప్రభ
Estd. 1938
Journalism first!
మంగళవారం 10, ఏప్రిల్ 2018

# జెఎన్‌టియుకె ఇన్‌చార్జి విసిగా రామకృష్ణారావు



(కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి) : జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి ఉపకులపతిగా మచిలీపట్నం లోని కృష్ణా యూనివర్శిటీ ఉపకులపతి ప్రొ.ఎస్.రామకృష్ణారావు నియమితులయ్యారు. ప్రస్తుత ఉపకులపతి ప్రొ.విఎస్ఎస్.కుమార్ పదవీ కాలం సోమవారం ముగిసింది. దీంతో ప్రభుత్వం రామకృష్ణారావును ఇన్‌ఛార్జిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అదే రోజు రాత్రి రామకృష్ణారావు కాకినాడ జెఎన్‌టియుకు విచ్చేసి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వర్శిటీ అధికారులు, టీచింగ్ ఐనాన్ టీచింగ్ స్టాఫ్ విసిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా విసి రామకృష్ణారావు మాట్లాడుతూ యూనివర్శిటీ అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలతో జెఎన్‌టియుకె అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం, ఓఎస్‌డి ప్రొ.కెవి.రమణ, రిజిస్ట్రార్ ప్రొ.వివి.సుబ్బారావు, డైరెక్టర్లు, ప్రోగ్రాం డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, టీచింగ్ ఐనాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో ఎంతో చేశా

## ..సత్కార సభలో విసి కుమార్

కాకినాడ సిటీ, ప్రభన్యూస్ :

అందరి సహకారంతో వర్శిటీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ విఎస్ఎస్ కుమార్ పేర్కొన్నారు. విసిగా పదవీకాలం పూర్తి చేసుకున్న కుమార్‌ను వర్శిటీ సెనేట్ హాలు యూనివర్శిటీ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ప్రొ.వివి.సుబ్బారావు మాట్లాడుతూ స్వయంకృషితో యూనివర్శిటీలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు కుమార్ ముందంజ బాట వేశాయన్నారు. ముఖ్యంగా నరసారావుపేటలోని యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌ను 80.94 ఎకరాలలో భవన నిర్మాణాలను చేపట్టారని, ఒక మార్కులో ఫెయిల్ అయిన విద్యార్థులకు లబ్ధి చేకూరేలా 0.15శాతం గ్రేస్ మార్కులను ఇచ్చి పాస్ పర్సంటేజీ పెరిగేలా చర్యలు తీసుకున్నారని, పలు భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు



చేశారని, మూక్స్ ఆన్‌లైన్ కోర్సులను దిగ్విజయంగా నిర్వహించడంలో జెఎన్‌టియుకె ప్రగతి సాధించిందన్నారు. అలాగే గ్రంథాలయాలను అనుసంధానం చేసి విద్యార్థులను ఆన్‌లైన్ జర్నల్స్‌ను అందుబాటులోకి తెచ్చేలా కృషి చేశారని, జంబ్లింగ్ విధానం, ఎగ్జామ్ సెంటర్‌లో పనులు ఆలస్యంగా కాకుండా అధునాతన ప్రింటింగ్ మిషన్‌లను అమర్చారని, జెఎన్‌టియుకెను ప్రగతిపథంలో నడిపించారని ప్రశంసించారు.

రెక్టార్ ప్రొ.కె.పూర్ణానందం మాట్లాడుతూ కుమార్ పరిపాలన పారదర్శకతతో కూడినదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేలా ఉండేదన్నారు. ఆర్అండ్‌డి డైరెక్టర్ ప్రొ.సిహెచ్. సాయి బాబు మాట్లాడుతూ ఏపి ఎంసెట్ ఛైర్మన్‌గా నాలుగుసార్లు సారథ్యం వహించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా పరీక్షను నిర్వహించడంలో సరైన చర్యలు తీసుకుని జెఎన్‌టియుకె ప్రతిష్టను కీర్తి శిఖరాలకు చేర్చారన్నారు. అనంతరం సన్మానగ్రహీత కుమార్ మాట్లాడుతూ జెఎన్‌టియుకెను అభివృద్ధి మార్గంలో నడిపించేందుకు తన శాయశక్తులా కృషి చేశానని, దీనికై అధికారులు, సిబ్బంది అంతా ఎంతో సహకరించి తోడ్పాటునందించారన్నారు. అనంతరం ఉపకులపతి దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రోగ్రాం డైరెక్టర్లు, యుసిఇకె, యుసిఇవి, యుసిఇఎన్ ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అనుబంధ కళాశాలల ఛైర్మన్‌లు, ప్రిన్సిపాల్స్, జెఎన్‌టియుకె టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.